క్లుప్తంగా

24 బోర్లకు మరమ్మతులు



కేఎస్ పురంలో తాగునీటి బోరు బాగు చేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల్లో 24 బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, మెకానిక్ సత్యనారాయణ తెలిపారు. కేఎస్‌పురంలో చేపడుతున్న మరమ్మతులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ, మండలంలో ఈ నెల 16న క్రాస్‌ప్రోగ్రాం ప్రారంభమైందన్నారు. ఇంకా గ్రామాల్లో పాడైన బోర్లు ఉంటే తమకు సమాచారం తెలియజేయాలని సూచించారు.

నేత్ర పరీక్షలు తప్పనిసరి

• డాక్టర్ నగేష్‌రెడ్డి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

పార్వతీపురం టౌన్: కంటిచూపు కోల్పోకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా కంటివెలుగు సెల్ ఆప్తాలమిస్ట్ నగేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సోమవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ గ్లకోమా వారోత్సవాలను ఈ నెల 10వ తేదీ నుంచి 16 వరకు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కంటిచూపు కోల్పో కుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవగాహన సదస్సులు, సమావేశాలు, ర్యాలీలు, ఉచిత చికిత్సలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి సుకుమార్‌బాబు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్యామల, ఆప్తాలమిస్ట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు 'సిద్ధం'

సీతానగరం: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు మేమంతా 'సిద్ధం'గా ఉన్నామని గాదెలవలస పరిసర గ్రామాల ప్రజలు నినదించారు. గాదెలవలసలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణమ్మ అధ్యక్షతన సోమవారం 'సిద్ధం' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 2024లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో పలు ఫార్మా కంపెనీలతో పాటు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైన నిరుద్యోగ యువత విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో నేరుగా ఇటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు జీతభత్యాలు ఉండవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిజమైన ఆదివాసీలకే సీట్లు కేటాయించాలి

సీతంపేట: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 7 ఎస్టీ రిజర్వ్‌డ్ ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటును నిజమైన ఆదివాసీ అభ్యర్థులకు కేటాయించాలని, నకిలీ అభ్యర్థులకు సీట్లు ఇవ్వొద్దని ఆదివాసీ జేఏసీ నాయకులు కె.ధర్మారావు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో అరుకు ఎంపీగా పనిచేసిన కొత్తపల్లి గీత ఎస్టీ కాదని డీఎల్ఎస్‌సీ కోర్టు తీర్పు ఇచ్చినా.. ఇప్పుడు బీజేపీ పార్టీ ఎస్టీ రిజర్వ్‌డ్ నుంచి ఎంపీ సీటు కేటాయించాలని భావిస్తోందన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇదే జరిగితే జాతీయ పార్టీ అయిన భారతీయ ఆదివాసీ పార్టీ తరపున అన్ని అస్సెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపి తాము గెలిపించుకుంటామన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పరిపాలన..



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

బలిజిపేట: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పాలన సాగించారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 5,655 మంది లబ్ధిదారులకు 10.60 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందించారని తెలిపారు. మహిళల పేరిటే అన్ని పథకాలు అమలు చేయడం వల్ల వారికి ఆర్థిక భరోసా కలిగిందని చెప్పారు. ప్రభుత్వం వైపు చూసే ప్రతి కుటుంబానికీ అండగా ఉండాలనేది సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచన అని తెలిపారు. చేసిన అభివృద్ధి.. అందించిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందని స్పష్టం చేశారు. గత టీడీపీ హయాంలో ఏ పని కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని.. ప్రస్తుతం అర్హత ఉంటే చాలు పథకాలన్నీ ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. మీకు మేలు జరిగిందని భావిస్తేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్ష నాయకులు తప్పుడు వాగ్దానాలతో ప్రజల వద్దకు వస్తుంటారని, అటువంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పలగర సహకార సంఘ అధ్యక్షుడు జి.పకీరునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల మహిళా సంఘ అధ్యక్షురాలు దుర్గేశ్వరి, మండల సచివాలయ కన్వీనర్ల సంఘ అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ గురురాజు, పి.సత్యనారాయణ, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఏపీఎం ఉమామహేశ్వరరావు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

జగనన్న ఇళ్లు ఇకపై లబ్ధిదారుల సొంతం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడు, చిత్రంలో సర్పంచ్ మోహిని

మక్కువ: ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన జగనన్న ఇళ్లు ఇకపై లబ్ధిదారుల సొంతమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. మండలంలోని సరాయివలస సచివాలయంలో సోమవారం కొండబుచ్చమ్మపేట, సరాయివలస గ్రామాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు జగనన్న గృహహక్కు పత్రాలను సర్పంచ్ మోహినితో కలిసి అందించారు. ఈ సందర్భంగా రంగునాయుడు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలను అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. ఇళ్లులేని వారికి ఇళ్లు, పింఛన్లు, పోడుపట్టాలు, డీ పట్టాలు అందిస్తున్నారన్నారు. నవరత్న పథకాలతో ప్రతీ పేదవానికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సింహాచలం, వెలుగు ఏపీఎం సన్నిబాబు, పంచాయతీ కార్యదర్శి షరళ, వీఆర్వో కాశీరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కురుపాం: ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా గ్రామీణ లబ్ధిదారులతో సోమవారం స్థానిక గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో వెబ్‌కాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా పీఎం నరేంద్ర మోదీ సందేశాన్ని అధికారులు వెబ్‌కాస్ట్ ద్వారా మహిళలకు వినిపించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మోదీ పిలుపునిచ్చారు. సమావేశంలో హౌసింగ్ డీఈ పి.మోహనరావు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, పీఎంఏవై లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేదారిపురంలో 'మేము సిద్ధం'



ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ ఎస్.కృష్ణారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

సచివాలయాల్లో పోటీపరీక్షల పుస్తకాలు



పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: మండలంలోని చిదిమి, కిమ్మి, కంబర, తూడి, వండవ, నడిమికెల్ల, తెట్టంగి సచివాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన 21 రకాల పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం ఆయా గ్రామాల సచివాలయాలకు అందజేశారు. డీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అనుమతితో వాటిని ఇంటికి తీసుకువెళ్లి చదువుకోవచ్చన్నారు. ఆయనతో పాటు సూపరింటిండెంట్ వెంకటరమణ ఉన్నారు.

నిబంధనల మేరకు చెల్లింపులు

గరుగుబిల్లి: పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లింపులు చేయనున్నట్లు ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఐసీ నిబంధనల మేరకు డిజిటల్ చెల్లింపులు నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశించడం జరిగిందన్నారు. నిధుల దుర్వినియోగం కాకుండా ఉండేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులు సిబ్బందికి సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదుచేయడం జరుగుతుందన్నారు.

ఏ పనికి ఎంత ఇవ్వాలో చెప్పండి



అధికారులను నిలదీస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు

• వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
• అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్ కార్యాలయం సిబ్బంది పనితీరుపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రశ్నోత్తరాల సమయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఏడాది క్రితం ఇంటిపేరు మార్పునకు సంబంధించి అన్ని పత్రాలతో దరఖాస్తు చేసినా ఇప్పటివరకు పని పూర్తికాలేదని అన్నారు. మామూళ్లు ఇస్తేనే పనులు చేస్తారా.. లేదంటే పనులు చేయరా అని అధికారులను నిలదీశారు. ఇంటి పత్రాలకు సంబంధించి ఓ వ్యక్తి ఆర్ఐను కలవగా అన్ని పత్రాలు సరిగ్గానే ఉన్నాయని, పైవారిని కలవాలని సూచించారని, ఆపైవారు ఎవరో తెలపాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి ఆర్ఐను ప్రశ్నించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నంబరు షాపు అద్దె డబ్బులు వసూలు చేసారా లేదా, ఆ డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్లాయో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు గిరిరఘు, మాధవరావు తదితరులు డిమాండ్ చేశారు. పట్టణంలో మెంటాడ వీధికి చెందిన సువ్వాడ గణపతికి ఇంటి కుళాయి కనెక్షన్ లేకపోయినా పన్ను కట్టాలంటూ నోటీసులు ఎందుకు పంపిస్తున్నారని కౌన్సిలర్ వెంకటరమణ ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. నా వార్డులో ఒక వృద్ధునికి ఇంటి కుళాయి కనెక్షన్ వేయమంటే అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన జేసీబీ నడిపేందుకు డ్రైవర్లు, క్లీనర్ల నియామకం అంశాన్ని కౌన్సిలర్లు మరోసారి వాయిదా వేశారు. అధికారులు సమయపాలన పాటించడం లేదని మండిపడ్డారు. సమావేశం ప్రారంభమైనప్పటికి కమిషనర్ సమావేశానికి హాజరుకాకపోవడం ఏమిటని, కమిషనర్ సమావేశానికి రావాలని పట్టుబట్టగా ఆమె వచ్చాక చర్చ ప్రారంభమైంది. సమావేశంలో పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: రేగులపాడు కేజీబీవీలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల పేర్కొన్నారు. 6వ తరగతిలో 40, ఇంటర్మీడియట్‌లో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అర్హులైన బాలికలు ఏపీ కేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, లేదంటే నేరుగా రేగులపాడు కేజీబీవీకి వచ్చినా మీ దరఖాస్తు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7893161665 నంబరులో సంప్రదించాలని కోరారు.

• భామిని: కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాగ్యవతి తెలిపారు. 6వ తరగతిలో 40, 8వ తరగతిలో 01, ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు, వలస కార్మికుల పిల్లలకు ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

• కురుపాం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇంటిక్కుల కిరణ్‌కుమారి సోమవారం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 01, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఏప్రిల్ 11వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

• గుమ్మలక్ష్మీపురం: కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్‌లో 40 సీట్లు, 9వ తరగతిలో 02 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల వివరాలు, విద్యార్థి పాస్ ఫొటో, మొబైల్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సిద్ధం సభతో కదిలిన ప్రత్యర్థుల పునాదులు

వీరఘట్టం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభతో ప్రత్యర్థుల పునాదులు కదులుతున్నాయని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్ధం సభకు లక్షలాదిగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు తరలిరావడంతో సభాప్రాంగణం జనసంద్రమైందని, అయితే పచ్చమీడియా మాత్రం సిద్ధం సభకు జనాదరణ లేదని తప్పుడు వార్తలు రాస్తున్నాయని మండిపడ్డారు. సిద్ధం సభకు వచ్చిన జన సునామీని చూసి ఓర్వలేకనే ఇటువంటి తప్పుడు వార్తలు రాస్తున్నాయన్నారు. మీరు ఎంత మందితో పొత్తులు పెట్టుకున్నా, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్‌సీపీ యేనని, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను టీడీపీ మోసం చేయాలని చూస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఘోర పరాభవం తప్పదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, భోగి మణి, సొంట్యాన సింహాచలం, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి, తదితరులు

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటాం



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాలూరు: పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. రెండు నెలల జీతాలు, పండగ నెల అడ్వాన్స్ వెయ్యి రుపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం నిధులు మంజూరుచేసినా సాంకేతిక సమస్యలు సాకుగా చూపుతూ మున్సిపల్ అధికారులు జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ స్పందిస్తూ.. త్వరలోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటానని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.వై.నాయుడు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం..

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పురపాలక సంఘంలోని 23, 24, 25 పోలింగ్‌బూత్‌ల పరిధిలో గల వార్డుల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో 20 వార్డు సచివాలయ కన్వీనర్ చందన ఆనంద్ నివాసం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యధిక పోలింగ్ జరిగేలా చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. బూత్ పరిధిలో గల ఓటర్లందరినీ నేరుగా కలుసుకుని చైతన్యపరచాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, సచివాలయం కన్వీనర్లు సామల లలిత, చందాన ఆనంద్, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై చైతన్యపరచండి..



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం

• ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: ఓటుహక్కు వినియోగంపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ సాధారణ ఎన్నికలలో ఓటుహక్కును వినియోగించుకునే విధంగా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని చెప్పారు. ఎంఈఓ సామల సింహాచలం మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించామని, వారి ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ సుగుణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న మావుడి సోదరులు

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రాస్‌ప్రోగ్రాం కార్యక్రమాన్ని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మావుడి సోదరులు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూసేందుకు ప్రభుత్వం క్రాస్ ప్రోగ్రాం చేపట్టిందన్నారు. ఈ నెల 11 నుంచి ఏప్రిల్ 27 వరకు షెడ్యూల్ ప్రకారం 21 పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లు, రక్షిత పథకాలకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రభుత్వం ఇంటింట కుళాయిలు, రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటుచేసిందన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.దేవకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జోగారావు, వెలుగు ఏపీఎం సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రం ప్రారంభం



పెదబుడ్డిడిలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి, తురకనాయుడువలస సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, అన్నదాత సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో ఆర్‌బీకేలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, పురుగుమందులు, రైతులు పండించిన ప్రతీ పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ఆర్‌బీకేలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీమల సుజాత, మాజీ ఎంపీటీసీ బాబా భువనమోహనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.